


ఫిలింనగర్‌లోని ఒక పెద్ద బంగళా ముందు ఆటో రిక్షా ఆగింది. రామారావు, వంశీ, ప్రసాదు దిగారు. బంగళా వంక తేరిపార చూసారు. గోడకు నేమ్‌ప్లేట్ లేదు.

"ఇదేనంటావా భగవాన్ ఇల్లు?" సందేహంగా అడిగాడు రామారావు స్నేహితులిద్దరితో.

"డౌట్‌లేదు. అడ్రస్ కరెక్టే. లోపలకు వెళ్దాం" అన్నాడు వంశీ.

"ఓరోరి... కుమ్మరి పెంకుటింట్లో అద్దెకుండేటోడు ఎంత పెద్ద బిల్డింగ్ కట్టేడు? మన పాలకొల్లు రాజావారికి కూడా ఇంత పెద్ద బంగళా లేదు" ఆశ్చర్యంగా అన్నాడు ప్రసాద్.

"టైం...టైం అలాంటిది మరి. మూడు సంవత్సరాల్లో వాడి టైం అలా మారిపోయింది. ముప్ఫై ఏళ్ల నుంచీ నాటకాల్లో తెల్లార్లూ గొంతు చించుకుంటున్నా మన టైం సెకను కూడా ముందుకు కదలడంలేదు" నిట్టూర్చాడు రామారావు.

గేటు దగ్గరకు రాగానే గూర్ఖా లేచి నిలుచున్నాడు.

"ఏ కంపెనీ సార్ మీది?" అడిగాడు వినయంగా.

"కంపెనీ ఏంటి? మాది పాలకొల్లు. పద్మశ్రీ కల్చరల్ అసోసియేషన్ ఆఫీసు బేరర్లం. భగవాన్ గాడిని కలవాలి" చెప్పాడు వంశీ.

'భగవాన్‌గాడిని' అన్న పదం వినబడగానే గూర్ఖా ముఖంలో కొంచెం కోపం కనిపించింది.

"ఆఫీసులో బేరర్లా? చాల్చాల్లే... సార్ చాలా బిజీగా ఉన్నారు. వెళ్లండి" అన్నాడు నిర్లక్ష్యంగా.

"బేరర్లు అంటే హోటళ్లల్లో పని చేసే ఆ బేరర్లు కాదయ్యా. కార్యకర్తలం. వాడు మా ఫ్రెండే. అర్జంటుగా కలవాలి. మేం సాయంత్రం బండికెళ్లాలి" కంగారుగా అన్నాడు రామారావు.

"కుదరదయ్యా... లోపల నలుగురు ప్రొడ్యూసర్లు వెయిటింగ్‌లో ఉన్నారు. వెళ్లండంటే మీక్కాదూ?" కసిరాడు గూర్ఖా.

స్నేహితుల ముఖాలు ఆముదం తాగాయి. రామారావు కోపంగా ఏదో అనబోయాడు.

"మనం అర్జంటుగా వసుదేవుడిని గుర్తుకు తెచ్చుకోవాలిరా. లేకపోతే కార్యం చెడుతుంది" చెవిలో ఊదాడు ప్రసాదు.

"బాబ్బాబూ.... పుణ్యం ఉంటుంది. సార్‌ది మాది ఒకే ఊరు. ఆయన మాకు బాగా తెలుసు. కొంచెం లోపలకు పోనీ" బతిమాలాడు రామారావు.

"సార్ మీకు తెలుసు సరే. సార్‌కి మీరు తెలుసా?" అన్నాడు గూర్ఖా.

ఆ పంచ్‌కు అదిరిపోయారు ముగ్గురూ. నీళ్లు నములుతున్న వీరిని చూసి "సార్ ఆంధ్రదేశంలో అందరికీ తెలుసు. ఇలా ఫ్రెండ్స్ అని చెప్పి వచ్చిన ప్రతివాడినీ పంపిస్తే సార్ నన్ను ఇంటికి పంపిస్తారు. పొండయ్యా బాబూ..." కొంచెం కోపంగా అన్నాడు గూర్ఖా.

ఇంతలో గేటు తెరుచుకుని రెండు భారీ కాయాలు నవ్వు ముఖాలతో బయటకొచ్చాయి.

"హమ్మయ్యా... పదిలక్షలు పోతే పోయాయి గానీ రెండురోజుల కాల్షీట్లు సంపాదించాం. ఇక మన సినిమా బంపర్‌హిట్టే" ఒకాయన మరొకాయనతో అన్నాడు.

ఇద్దరూ వెలుగుతున్న ముఖాలతో ఇనోవా కారెక్కారు. పళ్లు నూరుకున్నారు ముగ్గురూ.

"దేనికైనా సుడి వుండాలి. ఐదేళ్లక్రితం మనం ఒక నాటకం వేస్తున్నప్పుడు చిన్న వేషం ఇప్పించమని కాళ్లావేళ్లా పడితే 'ఒకసారి ముఖాన్ని అద్దంలో చూసుకో' అని విదిలించి కొట్టాం. అలాంటివాడు ఇవ్వాళ కామెడీ కింగ్. సంవత్సరానికి యాభై సినిమాలు. వాడు తమ సినిమాలో ఒక్క సీనులోనైనా ఉండాల్సిందేనని పెద్ద పెద్ద హీరోల మంకుపట్టు. వాడి పక్కన హీరోయిన్‌తో ఒక్క స్టెప్ అయినా వేయించాలని డైరెక్టర్ల తహతహ. బురదలో దొర్లాడే పందిలా ఉన్నాడని మనం విదిల్చికొట్టినోడు ఇవ్వాళ అందరికీ బంగారు నందిలా కన్పిస్తున్నాడు. కాల మహిమ ఎంత చెడ్డదిరా" ఆక్రోశించాడు వంశీ.

గేటు లోపల్నుంచి హారన్ మోగింది. గూర్ఖా అలర్టయి వీరి ముగ్గురినీ పక్కకు తోసేసి గేటు బార్లా తీసాడు. ఒక ఏసీ టవేరా రివ్వున దూసుకొచ్చింది. అందులో భగవాన్ ఉన్నాడని ముగ్గురికీ అర్థమయింది. గభాల్న పరుగెత్తి నమస్కారాలు పెడుతూ "సార్...సార్" అని అరిచారు.

కారు సడెన్‌గా ఆగింది. విండో గ్లాస్ దించాడు భగవాన్. ఫుల్ మేకప్పులో పెద్ద కూలింగ్ గ్లాసెస్‌తో గుర్తు పట్టలేకుండా ఉన్నాడు భగవాన్.

"సార్... సార్... మన పాలకొల్లు నుంచి వచ్చాం. చిన్న పని సార్" 'మన' అనే పదాన్ని కొంచెం గట్టిగా పలికాడు రామారావు.

పాలకొల్లు అనగానే భగవాన్ ముఖంలో ఆనందం కనిపించింది.

"రైలు దిగుతుంటే దొంగలు జేబులు కత్తిరించారా? పర్లేదు. లోపలికి వెళ్లి మేనేజర్ని కలవండి. టిక్కెట్లు కొనిచ్చి రైలెక్కిస్తాడు. డ్రైవర్ పోనీ..." అన్నాడు.

గతుక్కుమన్నారు ముగ్గురూ.

"అది కాదు సార్. ఒక్క అరగంట మీతో మాట్లాడాలి" అన్నారు ఒకేసారి.

"మైగాడ్ అరగంటే... నేను అర్జంటుగా రామానాయుడు స్టూడియోకెళ్లాలి. వెంకటేష్, త్రిషలతో కాంబినేషన్ సీనుంది. అక్కడ వాళ్లు వెయిటింగ్. సాయంత్రం ఆరుగంటలకు కలుద్దాం" విండో గ్లాసు మూసేసాడు. భగవాన్. కారు దూసుకుపోయింది. హతాశులయ్యారు ముగ్గురూ.

"ఆరుంబావుకు రండి. ఏడుగంటల నుంచీ

సార్‌కు పద్మాలయాలో మరో షూటింగ్ ఉంది'' చెప్పాడు గూర్ఖా వారివంక జాలిగా చూస్తూ.

"ఎంతైనా ఒక ఊరివాళ్లం. కనీసం లోపలికెళ్లి కూర్చోండి అని కూడా అన లేదు'' పళ్లు కొరికాడు రామారావు.

"మనల్ని గుర్తు పట్టలేదేమో'' అన్నాడు వంశీ.

★★★

సాయంత్రం వరకూ ఫిలింనగర్‌లో అన్ని రోడ్లు తిరిగారు. పెద్ద పెద్ద భవంతులను చూస్తూ వాటి యజమానులను కసితీరా తిట్టుకున్నారు. ఐదు న్నరకల్లా భగవాన్ ఇంటికి వచ్చారు.

వాళ్లను చూడగానే గూర్ఖా... "అరెరె.. ఎక్కడికెళ్లారు? మీరు వెళ్లగానే సార్ ఫోన్ చేసారు. వాళ్లు మా ఊరివాళ్లు. లోపల కూర్చోబెట్టి భోజన ఏర్పాట్లు చేయమని చెప్పారు. మీ కోసం రోడ్డంతా తిరిగాను'' చెప్పాడు.

"ఛీ...ఛీ... మనం బయలుదేరిన వేళ మంచిదికాదు'' తల బాదుకు న్నారు ముగ్గురూ.

"లోపలకు వెళ్లి కూర్చోండి. సార్ అరగంటలో వస్తారు'' గేటు తెరిచాడు గూర్ఖా. విశాలమైన ఆవరణలో ఏపుగా పెరిగిన రకరకాల చెట్లు, పచ్చని పచ్చిక, అందంగా పెంచిన రంగురంగుల క్రోటన్స్, రకరకాల పూలమొక్కలు... మధ్యలో ఆక ర్షణీయంగా నిర్మించిన నీటి గుంట, దాని మధ్య పాలరాతి దిమ్మె మీద అంద మైన స్త్రీ మూర్తి, నీటి గుంట గోడ మీద కట్టిన ఫౌంటెన్, ఇటలీ మార్బుల్‌తో తయారుచేసిన బెంచీలు, నాలుగు కార్లు పార్కు చేసేంత పార్కింగ్ ప్లేస్, కళాత్మకంగా నిర్మించిన ట్రిప్లెక్స్ భవనం... రెప్పార్పకుండా చూసారు ముగ్గురూ.

"ఆహా... ఏం పెట్టి పుట్టాడ్రా వీడు? మొన్నటిదాకా సైకిల్‌కు దిక్కులేదు'' అనుకుంటూ ఉడికిపోయారు. ఇంతలో లోపలకు కారు దూసుకువచ్చింది. భగవాన్ దిగాడు. ముగ్గురూ లేచి వినయంగా నమస్కరించారు.

"ఫైవ్ మినిట్స్ కూర్చోండి వస్తాను'' చెప్పి లోపలకు వెళ్లాడు. సరిగ్గా ఐదు నిముషాల తరువాత తిరిగొచ్చాడు. "చెప్పండి. ఎవరు మీరు? ఏం చేస్తుంటారు? నాతో ఏం పని?''

"పాలకొల్లులో పద్మశ్రీ కల్చరల్ అసోసియేషన్ కార్యకర్తలం. మా సంస్థ గురించి వినే వుంటారు'' అన్నాడు రామారావు.

"విన్నట్టుంది. ఐతే?'' అన్నాడు భగవాన్.



"మనూళ్లో ప్రముఖ కవి సముద్రాల మాధవాచార్యులుగారి గురించి వినే వుంటారు. వారికీమధ్య కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆ సందర్భంగా వారికి ఘనసన్మానం చేసి వారి నూతన గ్రంథావిష్కరణ మీ చేతుల మీదుగా చేయించాలనేది పాలకొల్లు వాసుల కోరిక."

"నేనా? నేను కవిని కాను, పండితుడ్ని కాను. నాకేం అర్థతుంది? మూడోక్లాసు తప్పాను. పైగా నా ముఖం అద్దంలో చూసుకుంటే నాకే భయం వేస్తుంది." కొరడాతో బలంగా కొడితే చర్మం ఊడి వచ్చినట్లయింది ముగ్గురికీ. తమను భగవాన్ గుర్తు పట్టినట్లు అర్థమైంది.

"అమ్మమ్మ... ఎంత మాట. మనూరు నుంచి ప్రఖ్యాత కమెడియన్‌గా ఎదిగిన నటులు మీరు"

"అది సరే. ఆయన గురించి నేనేం మాట్లాడతాను అక్కడ?"

"మీ ఉపన్యాసం మేం రాసిస్తాం. మీరు షూటింగ్‌కు వచ్చినట్లు ఛీఫ్ గెస్ట్‌గా రండి. సభ విజయవంతమవుతుంది. ఒక మంచి పని చేసామన్న


## అందానికి ఆహారం

అందానికి మెరుగులు దిద్దుకోవడానికి నానా రకాలుగా తంటాలు పడుతుంటారు చాలామంది. సరైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంతోపాటు అందం కూడా ఇనుమడిస్తుంది. టమాటాలో విటమిన్ సి, లైకోపిన్, బీటాకెరోటిన్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి వార్థక్యాన్ని నివారిస్తుంది.



చర్మానికి మృదుత్వాన్ని ఇస్తుంది. శిరోజాలు వత్తుగా, నల్లగా నిగనిగలాడేలా చేస్తాయి. ఆపిల్ ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండడానికి అవసరమైన పీచు పదార్థాన్ని అందిస్తుంది.

-కాలిపు శంకరరావు



తృప్తి కలుగుతుంది" చేతులు నలుపుకుంటూ అన్నాడు రామారావు.

"మీ సభ ఎప్పుడు?"

"వచ్చేనెల పదో తారీకు."

"అరెరె... ఆ రోజు నేను అమెరికాలో తానావారి మీటింగ్‌కు వెళ్లాలే. సారీ..." బాధగా అన్నాడు భగవాన్.

"అంత మాట అనొద్దు. మీకు ఏ రోజు వీలుగా వుంటే ఆ రోజే మీటింగ్ పెడదాం" గాబరాగా అన్నాడు ప్రసాద్. నవ్వుకున్నాడు భగవాన్.

"ఎనిమిదో తారీకైతే ఓకే" అన్నాడు కారు దగ్గరకు నడుస్తూ.

***

పాలకొల్లులో ఒక ఆడిటోరియం. రెండువందలమంది కుర్చీలలో కూర్చుండగా ఐదువందలమంది ఇరుక్కుని నిలుచున్నారు. ముందు వరుసలో సముద్రాల, మరో ఇద్దరు కవులు, ఇద్దరు రాజకీయ నాయకులు, ఇద్దరు పారిశ్రామికవేత్తలు కూర్చున్నారు. ఏడు దాటినా కార్యక్రమం ప్రారంభించలేదంటే భగవాన్ ఇంకా రాలేదనే అర్థం. ఆడియన్స్ ఉత్సాహంగానే ఉన్నారుగానీ సముద్రాలలో అసహనం మొదలైంది.

"ఇటువంటి సభలకు సాహితీమూర్తులను ఆహ్వానించాలిగానీ సినిమా వాళ్లను పిలవడమేమిటి? " పక్కనున్న కవితో అన్నాడు చిరుకోపంతో.

"మన ముప్పై సంవత్సరాల సాహితీ జీవితంలో ఒక్క సాహిత్య సభకు ఇంతమంది జనాన్ని చూసామా? మీ పుస్తకావిష్కరణకు, సన్మానానికి ఇంతమంది రావడం గొప్పకాదూ?" అన్నాడు కవి.

"తలుకుబెలుకు రాళ్లు తట్టడెందుకు? వీళ్లంతా ఆ సినిమా వాడిని చూడడానికి వచ్చారు. సాహిత్యాభిలాషతో కాదు."

"నిర్వాహకులకు కావాల్సింది ఆడియెన్సు. సినిమా యాక్టర్ల సరసన నిలుచుని ఫోటోలు తీయించుకోవడం. వారికి మాత్రం సాహిత్యాభిలాష వుంటుందా?" నవ్వుతూ అన్నాడు కవి.

ఆడియన్సులో కలకలం మొదలైంది. 'వచ్చాడు...వచ్చాడు' అన్న కేకలు వినిపించాయి. రామారావు, వంశీ, ప్రసాద్‌ల మధ్యన నడుస్తూ వస్తున్నాడు భగవాన్. వీడియో కెమెరాల ఫ్లాష్‌లు నాన్‌స్టాప్‌గా వెలుగుతున్నాయి. జనమంతా ఎగబడి చూస్తున్నారు. కొంతమంది సినిమాలలో భగవాన్ వాడే ఊత పదాలను పెద్దగా చెబుతూ కేరింతలు కొడుతున్నారు. భగవాన్ అందరికీ అభివాదం చేస్తూ హుందాగా నడుస్తున్నాడు. నాలుగు సంవత్సరాలక్రితంవరకూ ఇదే పట్టణ వీధుల్లో తను నడుస్తుంటే వీధి కుక్క కూడా పట్టించుకోని విషయం గుర్తుకువచ్చి నవ్వుకున్నాడు. సభా కార్యక్రమం ప్రారంభమయింది. రామారావు అధ్యక్షత వహించగా ఎనిమిదిమంది అతిథులు వేదికను అలంకరించారు. సముద్రాల పక్కన భగవాన్ కూర్చున్నాడు.

రామారావు అధ్యక్షోపన్యాసం చేస్తూ తామింతవరకూ రెండువేల పుస్తకాలు ఆవిష్కరించామనీ, సాహిత్య సేవలో పీకల్లోతు మునిగి వున్నామనీ, రాష్ట్రప్రభుత్వం అవార్డులతోపాటు పద్మశ్రీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సముద్రాల మాధవాచార్యులుగారి గ్రంథావిష్కరణ జరపడం తమ అదృష్టమని చెప్పుకొచ్చాడు. తరువాత భగవాన్‌ను ఆకాశానికి ఎత్తేస్తూ పనిహేను నిముషాలు ఉపన్యసించాడు. పాలకొల్లు ముద్దుబిడ్డ, అభినవ రేలంగి, మరో రాజబాబు లాంటి విశేషణాలు ఉపయోగిస్తూ చివరికి అతనికి పద్మవిభూషణ్ రావాలని ఆకాంక్షించారు.

భగవాన్ పేరెత్తినప్పుడల్లా జనం చప్పట్లు కొడుతున్నారు. భగవాన్ నవ్వుతూ చూస్తున్నాడు. భగవాన్ గ్రంథావిష్కరణ చేసి మాట్లాడబోతుండగా రామారావు అడ్డుపడి "ఇప్పుడు గ్రంథ పరిచయం జరుగుతుంది. కవులిద్దరూ రెండు నిముషాలు ప్రసంగించాలి" అని ప్రకటించాడు.

కనీసం చెరో పావుగంట మాట్లాడాలనుకున్న కవుల ముఖాలు మాడిపోయాయి. అందరి ఉపన్యాసాలు అయిన తరువాత రామారావు లేచి "సముద్రాలగారు మాట్లాడిన తరువాత మీ అభిమాన కామెడీ కింగ్ భగవాన్‌గారు మాట్లాడతారు'' అని ప్రకటించాడు.

ముందుగానే భగవాన్ మాట్లాడితే జనమంతా వెళ్లిపోతారని కార్యకర్తల భయం. ముందుగా భగవాన్ మాట్లాడితే సినిమా పిచ్చోళ్లంతా వెళ్లిపోయి అచ్చమైన సాహితీ ప్రియులు మిగిలితే వారిముందు తన మనసు విప్పాలని సముద్రాల ఆశ. జనమంతా భగవాన్ కోసం అరుస్తున్నారు. సముద్రాలకు ఆగ్రహం తన్నుకొచ్చింది. దాన్ని దాచుకోలేకపోయాడు.

"ఇటువంటి సాహిత్య కార్యక్రమాలకు సినిమా నటులను పిలవడం ఏమాత్రం భావ్యం కాదు. నా యాభై సంవత్సరాల సాహిత్య జీవితంలో కొన్ని వేల సభలను చూసాను. ఏ సభలోనూ పట్టుమని పాతికమంది కనిపించలేదు. ఇవ్వాళ ఇన్ని ముఖాలు కనిపిస్తున్నాయంటే అది కేవలం సినిమా నటుడి ముఖం కోసమే అని తెలుస్తున్నది. ఈ సంస్థ కార్యకర్తలు ఏళ్ల తరబడి సాహిత్య సేవ చేస్తున్నామని చెప్పుకున్నారు. ఏంటా సేవ? సినిమా నటులతో రాసుకుని పూసుకుని తిరుగుతూ వాళ్లతో ఫోటోలు తీయించుకోవడమా? నిజంగా మీరు సాహిత్య సేవ చేయదల్చుకుంటే పుస్తకాలను ఆవిష్కరించడం కాదు, ఆ పుస్తకాన్ని కనీసం వంద కాపీలైనా అమ్మించి కవిని బ్రతికించండి. మరో కొత్త గ్రంథానికి ఊపిరి పోయండి. కవులు రాయడమే తప్ప చదివే పాఠకులు లేరు. పాతిక సంవత్సరాల క్రితం సమ్మయ్య అనే హరిజన బాలుడు నా క్లాసులో ఉండేవాడు. పాండురంగ మహత్మ్యం, కళా పూర్ణోదయం వంటి పాఠాలు చెబుతుంటే పద్యాలను అత్యంత శ్రద్ధగా విని క్లాసు అయిపోయేలోపల ఒక్క అక్షరం తప్పు లేకుండా ఒప్పజెప్పేవాడు. ఆ వయసులోనే నేను రచించిన పద్య కావ్యాలు చదివేవాడు. సాహిత్య సేవ అంటే అలా వుండాలి...'' ఇలా సాగింది ఆయన ఉపన్యాసం. జనానికి అంతగా ఎక్కలేదు.

భగవాన్ మాట్లాడడానికి లేవబోతుండగా రామారావు ఒక కాగితాన్ని అందించాడు. అది తాను చెప్పాల్సిన ప్రసంగ పాఠం అన్న విషయం అర్థమై నవ్వుకుని మడిచి జేబులో పెట్టుకున్నాడు భగవాన్.

మైకు ముందు నిల్చుని అతిథులందరికీ గౌరవ వందనాలు సమర్పించాడు. సముద్రాల రచించిన సుమారు పాతిక గ్రంథాల పేర్లు చెప్పడమే కాకుండా వాటిలోని పద్యాలను, కవితలను శ్రావ్యంగా ఆలపించాడు. సముద్రాల అప్రతిభుడయ్యాడు. సముద్రాల రచనల్లోని విశిష్ఠతను, కవితా సౌందర్యాన్ని, మానవీయ కోణాలను ఓ ప్రొఫెసర్‌లా విడమర్చి చెప్పాడు. ఆయన రాసిన ఫలానా కవిత, ఫలానా పద్యం తనను ఎలా ప్రభావితం చేసిందీ చెప్పాడు.తాను మూడు దశాబ్దాల క్రితం రచించి, ప్రస్తుతం ఒక్క కాపీ కూడా లేని గ్రంథంలోని కవిత్వాన్ని భగవాన్ గానం చేస్తుంటే సముద్రాల పులకించిపోయాడు. చప్పట్లు మారుమ్రోగాయి. వందన సమర్పణ కాగానే జనమంతా భగవాన్ చుట్టూ మూగి ఆటోగ్రాఫ్ కోసం ఎగబడ్డారు. కార్యకర్తలు కూడా భగవాన్‌తో ఫోటోలు తీయించుకోవడానికి పోటీలు పడుతున్నారు. సముద్రాల అతికష్టమ్మీద సభనుంచి బయటకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మాస్టారూ...మాస్టారూ.. సార్... మీ ఆటోగ్రాఫ్ ఇవ్వకుండానే వెళ్లిపోతున్నారు'' జనాన్ని తోసుకొస్తూ అన్నాడు భగవాన్.

"జనానికి మీ ఆటోగ్రాఫ్ కావాలి, మాబోటి వారి ఆటోగ్రాఫ్ ఎందుకు?'' నిర్లిప్తంగా అన్నాడు సముద్రాల.

"సార్! ఆ రోజుల్లో మీ పాదాలను తాకాలని ఎంత కోరికున్నా మీ కులం చూసి భయపడేవాడిని. ఈ పుస్తకం మీద సంతకం చేసిస్తే జీవితాంతం దాచుకుంటాను'' ఆవిష్కృత గ్రంథాన్నిస్తూ అన్నాడు భగవాన్.

"ఆ రోజుల్లోనా... ఎవరు మీరు?'' ఆశ్చర్యంగా అడిగాడు సముద్రాల.

"నేను సమ్మయ్యను సార్. మీ శిష్యుడిని. మీ పక్కన కూర్చునే అదృష్టం కోసమే అమెరికా ప్రయాణం కూడా వదలుకుని వచ్చాను'' సాష్టాంగపడ్డాడు భగవాన్. జనమంతా నివ్వెరపోయారు. జీవితంలో తొలిసారి ఆనంద భాష్పాలు రాల్చాడు సముద్రాల. శిష్యుడిని లేపి కౌగలించుకున్నాడు, సంతకం చేసి ఆశీర్వదించాడు.

సమ్మయ్య అలియాస్ భగవాన్ దాన్ని గుండెలకు హత్తుకుని "సాహిత్య సేవ వంటి పెద్ద మాటలు నాకు తెలియవు. ఈ అపురూప గ్రంథాన్ని నేను కొనుక్కుంటున్నాను. దీని వెల అమూల్యం. ఈ చిన్న మొత్తాన్ని స్వీకరించి నన్ను ధన్యుడిని చేయండి'' అని రెడీగా ఉన్న లక్షా నూట పదహార్ల చెక్కును అందించాడు భగవాన్.

☆



## అంతా అబద్ధం...!

లారా దత్తా తన బాయ్‌ఫ్రెండ్‌ని పెళ్లాడి వచ్చిందనే వార్త బాలీవుడ్‌లో గుప్పుమందీమధ్య. దాంతో మండిపడింది లారా. 'రాత్రే కాదు, పగలు కూడా నిద్రపోతూ కలలు కంటూ పుట్టించే వాళ్ల పుకార్లే ఇవి' అంటూ కొట్టి పారేసింది లారా. తన దృష్టిలో ప్రేమ అనే పదానికి అంత ప్రాధాన్యత కూడా లేదంటుందీమె. కానీ ఆమె 'ఫ్రెండ్' కెల్లీ పేరెత్తితే ముసిముసిగా నవ్వేస్తూ మాట దాటేస్తుంది. ఫ్చ్!

